
నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326
సంపుటి : -13 సంచిక : 72 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
04-01-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4



# పాలన మారిందా? ప్రజల జీవితం మారలేదా?

- గణాంకాల్లో పురోగతి గ్రామాల్లో నిరాశ
- వాగ్దానాల వెలుగుల్లో కనిపించని వాస్తవాలు
- సర్కార్ లెక్కలుజనం జీవితం మధ్య దూరం
- అభివృద్ధి పేరుతో పెరుగుతున్న అసంతృప్తి
- జిల్లా ఎదుగుదలేనా? లేక గణాంకాల మాయా?
- నినాదాల రాజకీయంలో నలిగిన జీవనాలు

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లాలో రాజకీయ వాతావరణం ఇప్పుడు నినాదాల దశను దాటి ప్రజల జీవితాలతో ముడిపడిన ప్రశ్నల దశకు చేరుతోంది. ఎన్నికల వేళ వినిపించిన హామీలు, ప్రకటనల మధ్య గ్రామాల నుంచి పట్టణాల వరకు ఒకే ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది "మార్పు నిజంగా వచ్చిందా?"చిహ్నాలపై పోరు బయటకు కనిపిస్తున్నా, వాస్తవానికి ప్రజలు పోల్చుకుంటున్నది తమ గత అనుభవాలు నేటి పరిస్థితులనే. ప్రభుత్వ ప్రకటనల్లో అభివృద్ధి గణాంకాలు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం రవ్వంత కూడా లేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.శ్రీకాకుళం జిల్లా ఆర్థికంగా ఇప్పటికీ వెనుకబడిన జిల్లాల జాబితాలోనే ఉంది. వ్యవసాయం, కూలీ పని, వలస ఉపాధి ఇవే పెద్ద సంఖ్యలో కుటుంబాలకు ప్రధాన జీవనాధారాలు. ప్రభుత్వ లెక్కల్లో ఆదాయం పెరిగినట్టు కనిపిస్తున్నా, గ్రామస్థాయిలో మాత్రం ఆర్థిక ఒత్తిడి తగ్గలేదన్న భావన ప్రజల్లో స్పష్టంగా ఉంది. ధరల పెరుగుదల, సాగు ఖర్చులు, అప్పుల భారంతో అనేక కుటుంబాలు ఇంకా సంక్షోభంలోనే ఉన్నాయన్న మాట వినిపిస్తోంది.వ్యవసాయం విషయంలో ప్రతి ప్రభుత్వం ఆశలు చూపుతున్నా, పంటలకు సరైన మద్దతు ధరలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, విత్తనాలుఎరువుల సమయానికి అందుబాటు వంటి మౌలిక అంశాలపై రైతులు ఇప్పటికీ అసంతృప్తిగా ఉన్నారు. రైతుల సమస్యలు పరిష్కారమైతేనే జిల్లా ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమవుతోంది.ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటంతో ప్రతి ఏడాది వేల మంది యువత వలస బాట పడుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు, ఐటీ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రకటనలు వస్తున్నప్పటికీ, అవి క్షేత్రస్థాయికి చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వలస జీవితం ఆదాయం ఇస్తున్నా, జిల్లాకు మాత్రం శ్రమశక్తి, మేధస్సు నష్టంగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.గ్రామీణ మౌలిక వసతుల విషయంలోనూ ప్రజల్లో అసంతృప్తి ఉంది. రహదారులు, తాగునీరు, డ్రెయినేజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలపై ఖర్చు జరుగుతున్నా, పనుల నాణ్యతపై సందేహాలు కొనసాగుతున్నాయి. కొన్ని పనులు ప్రారంభమైనా పూర్తి కావడానికి సంవత్సరాలు పడుతుండటం పాలనపై నమ్మకాన్ని దెబ్బతీస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యం, విద్య రంగాల్లో కూడా సిబ్బంది కొరత, సదుపాయాల లేమి కారణంగా ప్రజలు ప్రైవేట్ రంగంపై ఆధారపడాల్సి వస్తోంది. దీని వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. సంక్షేమ పథకాలు ఉన్నప్పటికీ, కుటుంబాల ఆర్థిక ఒత్తిడి ఎక్కువగా మహిళలపై పడుతోందన్న అభిప్రాయం ఉంది. ఉపాధి లోటు, ధరల పెరుగుదల, కొన్ని సామాజిక అలవాట్ల ప్రభావం ఇంటి స్థాయిలో సమస్యలను పెంచుతోందని మహిళలు చెబుతున్నారు.జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు కనిపించకపోయినా, ప్రజల మౌనం రాజకీయ వర్గాలకు హెచ్చరికగా మారుతోందన్న విశ్లేషణ వినిపిస్తోంది. బహిరంగంగా మాట్లాడని ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో చెప్పే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ఎన్నికల ముందు జిల్లాలో వినిపిస్తున్న ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు లేకపోతే, రాబోయే ఎన్నికల్లో ఫలితం ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ప్రజాస్వామ్య విలువలకు అంబేద్కర్ మార్గదర్శి

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్



**నవతరం -సరుబుజ్జిలి**

బాబా సాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛను కల్పించిందని, ఆయన ఆలోచనలు నేటి తరానికి నిరంతర మార్గదర్శకాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఆముదాలవలస నియోజకవర్గం, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పంచాయతీ పరిధిలోని పకీర్ సాహెబ్ పేట గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి కేంద్ర మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.

కేవలం విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా పకీర్ సాహెబ్ పేట గ్రామంలో సందడి నెలకొంది. నాయకులు ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ముగిసిన అభ్యుదయం సైకిల్ యాత్ర



**నవతరం -ఇచ్ఛాపురం**

ఆంధ్రప్రదేశ్‌ను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ కేంద్రంగా మారి యువత భవిష్యత్తు చిన్నాభిన్నమైందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 53 రోజులుగా 1300 కి.మీ. మేర సాగిన 'అభ్యుదయం' సైకిల్ యాత్ర శనివారం ఇచ్ఛాపురంలో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గంజాయి మూలాలను వెలికితీసి వాటిని పూర్తిగా నిర్మూలిస్తోందని, అలాగే యువతను నైపుణ్యం కలిగిన శక్తిగా మార్చేందుకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా, ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడుకలు జరగడం సంతోషంగా ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గంజాయి మత్తులో విద్యార్థులు కన్నవారిపైనే దాడులు చేయడం కలచివేస్తోందని, యువత బంగారు భవితను నాశనం చేసుకోవద్దని కోరారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితుల కష్టాలు చూసి ఆనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఐజీ గోపీనాథ్ జెట్టి మానస పుత్రికగా వచ్చిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో 'జీరో' స్థాయికి తీసుకువచ్చాం. కేవలం శిక్షల ద్వారానే కాకుండా, అవగాహన ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా రూ. 9.13 కోట్ల ఆస్తుల జప్తు, 53 వేల కేజీల గంజాయి ధ్వంసం వంటి గణాంకాలను ప్రస్తావించారు.

ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్ శాఖతోనే సాధ్యం కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం డ్రగ్స్ మాత్రమే కాకుండా సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై కూడా చైతన్యం తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈగల్ ఐజి ఎ .రవి కృష్ణ మాట్లాడుతు స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థం అవుతుందని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్కూల్లు కాలేజీలో విద్యార్థులు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్రమైన మార్పు వస్తే మత్తుపదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్ కు తెలియజేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ను వినియోగించాలని. మీకు ఎటువంటి సమస్యలు పోలీసులు నుండి ఎటువంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ఈ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. ఈ యాత్రలో 1.14 లక్షల మంది విద్యార్థులు, 36 వేల మంది ప్రజలు పాల్గొని 'సే నో టు డ్రగ్స్ బ్రో' అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నడుకుదుటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు తుహిన్ సిన్హా, ఏఆర్ దామోదర్, మాధవరెడ్డి పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎడిటోరియల్

# మరో ప్రపంచం పిలుస్తోంది

నిన్నటితో పాత సంవత్సరం ముగిసింది. నేడు మన జీవితంలోకి కొత్త ఏడాది ప్రవేశించింది.
ఎప్పటిలాగే పేద, మధ్య తరగతి మదిలో ఉదయించే ప్రశ్నలెన్నో- ఈసారైనా దేశం ఊపిరి పీల్చుకుంటుందేమోనన్న చిన్న ఆశ. ప్రజలే కేంద్రంగా పాలన మారుతుందేమోననే ఆశ. రాజ్యాంగం, ప్రజా స్వామ్యం, న్యాయం వంటి మౌలిక సూత్రాలకు మళ్లీ అర్థం దొరుకుతుందే మోననే ఆశ.
ప్రజలెదుర్కొంటున్న సమస్యలు యాద ృచ్ఛికం కాదు. అవి ఏలికలు అనుసరిస్తున్న విధానాల ఫలితం. ఆ వాస్తవ పరిస్థితులను ఎదు ర్కోకుండా ముందుకు నడవడం అసాధ్యం. ఈ కొత్త సంవత్సరం మన ముందుంచిన సత్యం కఠినమే. ప్రజాస్వామ్యం పేరుతో అధికారిక కేంద్రీ కరణ బలపడుతోంది. మతం పేరుతో విభజన రాజకీయం రాజ్యమేలు తోంది. పేదల 'ఎజెండా' వెనక్కిపోతోంది. కార్పొరేట్ ప్రయోజనమే ముం దుకొస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశం ఎలా నడవాలి? ఇదే కొత్త సంవత్సరపు అసలు ప్రశ్న. ప్రతిఒక్కరూ నిల్చున్నచోటే ఉండకూడదు. ప్రశ్నతో, సంఘీ భావంతో, ఆశయాన్ని భుజాన వేసుకుని కదలాలి ముందుకు. ఇవాళ దేశం నిలిచిన మలుపులో భయం అలవాటుగా మారింది. అన్యాయం సాధారణమయ్యింది. అస మానత అభివ ృద్ధిగా ముస్తాబయింది. ప్రశ్న దేశద్రోహంగా ముద్రించ బడింది. వీటన్నింటిని ఎదిరించి నిల బడాలి. విద్యార్థులు తమ భవిష్య త్తును కేవలం పోటీపరీక్షల గదుల్లో వెతకడం మానాలి. ఆలోచించే శక్తిని, ప్రశ్నించే ధైర్యం పెంచుకోవాలి. మేధావులు, బుద్ధిజీవులు తటస్తత ముసు గులో దాగిపోవడం సరికాదు. మౌనం కూడా రాజకీయ వైఖరేనన్న నిజాన్ని గుర్తించాలి. మహిళలు భద్రత కోసం వేడుకునే స్థితి ఉండకూడదు. ఉద్యో గులు, కార్మికులు, తమ హక్కులు దయాదాక్షిణ్యాలు కాదని, అవన్నీ పోరా టాలతోనే సాధ్యమని గుర్తించాలి. రైతులు విధానాల ముందు తలవంచ కుండా సంఘటితంగా నిలబడాలి. ప్రజాస్వామ్యంలో మార్పు పైనుంచి కిందికి రాదు, కిందినుంచే పైకి వస్తుంది. ప్రజాస్వామ్యం ఓటుతో ముగిసేది కాదు, అది ప్రతిరోజూ జరిగే పోరాటం. ఈ పోరాటం విధ్వంసం కోసం కాదు, ఇది రాజ్యాంగాన్ని కాపాడుకునే యాత్ర. ఇది రైతు మద్దతు ధరకు, కార్మికుని హక్కుకు, విద్యార్థి చైతన్యానికి, మహిళా గౌరవానికి అర్థం చేకూర్చే ప్రస్థానం.
దేశం తీవ్రమైన అసమానతల మధ్య ఊగిసలాడుతోంది. ఒక సామాన్య కుటుంబం కొత్త ఏడాదిని సంబరాలతో కాదు- లెక్కలతో స్వాగతిస్తోంది. జీతం ఎంత పెరిగిందో కాదు, ఖర్చులు ఎంత పెరిగాయో ముందు చూసు కుంటున్నది. పిల్లల ఫీజులు, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, నిత్యావసర ధరలు- ఇవే వారి ఆర్థిక బడ్జెట్. ప్రభుత్వాల అభివ ృద్ధి మాటలు టీవీల్లో కనిపిస్తాయి, వేదికలపై వినిపిస్తాయి. కానీ, ఈ కుటుంబానికి బడ్జెట్ అంటే ప్రభుత్వాలు వల్లించే గణంకాలు కాదు, నెలవారి ఖర్చు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య వ్యయం, చదువుకు రుణం, పింఛన్ మీద అనిశ్చితి. ఏ చిన్న జబ్బు వచ్చినా మొత్తం బడ్జెట్ కూలి పోతుందన్న ఆందోళన. అయినా ఈ కుటుంబమే పన్నులు కడుతోంది. చట్టాన్ని పాటి స్తోంది. దేశం బాగుండాలని ఆశిస్తోంది. ఆశలు వ్యక్తిగతం కావు, ఇవి దేశపు ఆరోగ్య సూచికలు. ఒక పేదవాడు మరింత పేదరికంలోకి కూరుకు పోవడం పాలనావైఫల్యం. ఒక కుటుం బం భయంతో, అప్పులతో, అభద్రతతో బతుకుతుంటే- అది అభివ ృద్ధి కానే కాదు. పెట్టుబడిదారి సమాజం మనిషిని కేవలం వినియోగదారునిగా మార్చిన దుస్థితికి అద్దం.
అభివ ృద్ధి అనే మాట దేశంలో ఎంతగట్టిగా వినిపిస్తున్నా, పేదరికం మాత్రం మౌనంగా కేకలు వేస్తూనేవుంది.నిరుద్యోగుల కల చెదిరి పోతోంది. రైతుకు రుణభారమే మిగిలిపోతోంది.దళితులు,ఆదివాసులు, మైనార్టీలపై 'అభద్రత' కత్తి వేలాడుతూనే ఉంది. రాజ్యాంగం స్థానంలో రాజకీయ అహంకారం పెరుగుతోంది. ఈ సమయంలో కొత్త సంవత్సరం సంఘీభావం, సంస్కరణలను కోరుతోంది. దేశ భవిష్యత్తు వ్యక్తిగత కలలతోనే కాదు, సామూహిక చైతన్యంతో నిర్మితమవు తుంది. ప్రశ్న.. నేరం కాదు. నిరసన.. దేశద్రోహం కాదు. ఇవి మనకు రాజ్యాంగమిచ్చిన హక్కులు. వాటిని వినియోగించు కోకపోతే ప్రజాస్వామ్యం కాగితాలకే పరిమితమవుతుంది. అందుకే ప్రజలు ఓటేసి మౌనంగా ఉంటామంటే కుదరదు, ఆ దశను దాటాలి. ప్రశ్నించడం, నిరసించడం, ఐక్యంగా నిలబడ టం- ఇవే దేశాన్ని ముందుకు నడిపే శక్తులు. మీడియా కూడా కార్మికుడి చెమటను, రైతు కన్నీటిని, యువత ఆశలను, మహిళల శ్రమను వార్తలుగా కాదు- విలువలుగా చూపిస్తూ ముందుకు పోవాలి. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ ఒకేలా రావచ్చు.కానీ, బాధ్యతలు మాత్రం ఒక్కోవర్గానికి ఒక్కోలా ఉంటాయి. కొత్త ఏడాదంటే పాత అన్యాయాలను మర్చిపోవడం కాదు, వాటిని మార్చే సంకల్పం. ఈ సందర్భంగా శ్రీశ్రీ మాటల్ని ఒక్కసారి మననం చేసుకోవాలి.

# మెడిటేషన్ అడ్వకేటర్‌కు సర్టిఫికెట్స్ అందజేత

### సీనియర్ సివిల్ జడ్జ్ బి నిర్మల



**నవతరం టెక్కలి**

నేడు టెక్కలి సీనియర్ సివిల్ జడ్జ్ బి నిర్మల వారి ఆధ్వర్యంలో ఇటీవల మెడిటేషన్ అడ్వకేటరుగా శిక్షణ పొందిన టెక్కలి ఏజిపి దివ్వల వివేకానంద, న్యాయవాదులు సంపత్ రావు దివాకర్ ,అంపోలు వైకుంఠ రావు, దుంపల భుజంగరావు లకు ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ పరమైన కేసులు, ఆస్తి తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మనీ సూట్స్ , మధ్యవర్తత్వం ద్వారా పరిష్కరించుకోవలసినదిగా సూచించారు. మెడిటేషన్ ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకుంటే, కాలయాపన కోర్టులు చుట్టూ తిరిగే పరిస్థితి మానసిక ఆందోళన నుండి బయట పడవచ్చునని ఆమె తెలిపారు.

# కేజీబీవీల్లో కొలువుల జాతర

- 55 బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- దరఖాస్తులకు ఈ నెల 11 వరకు గడువు
- ప్రాజెక్ట్ అధికారి పి. వేణుగోపాలరావు వెల్లడి

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 55 బోధన, బోధనేతర పోస్టులను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ అధికారి పి. వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2026 సంవత్సరానికి గానూ అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా స్థాయి పరిధిలోకి వచ్చే వృత్తి విద్యా బోధకులు, కంప్యూటర్ అధ్యాపకులు, ఆరోగ్య కార్యకర్తలు, వార్డెన్లు, పార్ట్ టైం ఉపాధ్యాయులు కలిపి మొత్తం 29 పోస్టులు ఉన్నాయి. అలాగే మండల స్థాయి పరిధిలో సహాయకులు, ప్రధాన వంటమనుషులు, సహాయ వంటమనుషులు, కాపలాదారులు, పారిశుధ్య కార్మికులు కలిపి మొత్తం 26 ఖాళీలు ఉన్నట్లు ఆయన వివరించారు.సాధారణ అభ్యర్థులకు 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి 50 ఏళ్ల వరకు సడలింపు ఉంటుంది. మండల స్థాయి పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత మండల విద్యాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు పొంది, అక్కడే సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి పోస్టులకు దరఖాస్తు చేసే వారు శ్రీకాకుళంలోని సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి అందజేయాలి. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు కార్యాలయ పనిదినాల్లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారని, అభ్యర్థులు తమ ధృవపత్రాల నకళ్లను జతచేయాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు.

### దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి ఆద్వర్యంలో నివాళ్ళులర్పించిన నేతలు

# సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళి

**నవతరం -శ్రీకాకుళం**



భారతదేశ తొలి మహిళా గురువు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆ మహానుభావురాలికి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో దళిత -ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నేతలు శనివారం ఘనంగా నివాళ్ళులర్పించారు. సావిత్రి బాయి పూలే చిత్రపటానికి తైక్వాండో శ్రీను.,డాకంఠ వేణు,రాయి వేణుగోపాల్ ,ఎం.ఎ.రఫి,మహిబుల్లా ఖాన్ ,నటుకుల మోహన్ ,వైశ్యరాజు మోహన్ ,విజయ్ తదితరులు అంతా కలసి పూలమాలలు వేసారు. జోహార్ సావిత్ర బాయి పూలే అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా దళిత- ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు తైక్వాండో శ్రీను.డాకంఠ వేణు,రాయి వేణుగోపాల్ లు మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి దేశంలోనే మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిన ఘనత సావిత్రిబాయి పూలేకే దక్కిందన్నారు. కుల వ్యవస్థకు, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేసిన ధీర వనిత ఆమె అని కొనియాడారు.
పీడిత ప్రజలు కోసం ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని పేర్కొన్నారు.
నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారంటే అందుకు కారణంగా నాడు స్త్రీల విద్య కోసం ఆమె చేసిన పోరాటమే కారణమని అన్నారు.
సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకి మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నేతలు ఎల్ .నాగరాజు , శైలాని,జోగిపాటి వంశి, పెయ్యల చంటి ,పంకు మహేష్ ,అబ్బాస్ ,శీర రాజు తదితరులు అంతా పాల్గొన్నారు.

# రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేయాలి




**నవతరం -శ్రీకాకుళం**

రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవాదాయ శాఖ, సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఏర్పాటుచేసిన ప్రచార రథమును శనివారం శ్రీశ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం వద్ద వేద పండితుల ఆశీర్వచనం, మంత్రోచ్ఛారణ చేసి, స్థానిక ప్రజలు, ఆలయ స్పెషల్ ఆఫీసర్, ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. రథసప్తమి ఉత్సవాలను జనవరి 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయశాఖ అధికారులు, వేద పండితులు, ఆలయ అధికారులు, అర్చకులు, పురోహితులు సమక్షంలో రథసప్తమి సప్తాహ దినాలను విజయవంతం చేసేందుకు ప్రచార రథమును ప్రారంభించారు. ఏడు రోజులు వివిధ కార్యక్రమాలతో, ముఖ్యంగా లక్ష పుష్పార్చన, సూర్య నమస్కారాలు, సౌర యాగ హోమం, స్వర్ణ అలంకరణ, స్వామివారి నిజరూప దర్శనం వంటి సేవలతో నిర్వహిస్తున్న రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు ప్రజలు తరలిరావాలని భక్తులకు తెలియజేసేందుకు ప్రచార రథం గ్రామాల్లో భక్తులకు తెలియజేస్తారు. గోడ పత్రికలు కరపత్రికలను కూడా ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరించారు.ఆలయ అధికారులు, అర్చకులు స్థానికులు . . స్థానిక కూటమి నాయకులు, అరసవెల్లి తెదేపా నాయకులు, ఉత్సవాల స్పెషల్ ఆఫీసర్, ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు అర్చకులు, భక్తులు, అరసవిల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

**నవతరం -శ్రీకాకుళం**

# బాలికా విద్యావ్యాప్తికి పూలే సేవలు చిరస్మరణీయం

బాలికా విద్యావ్యాప్తికి, మూఢాచారాల నిర్మూలనకు సావిత్రిబాయి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని జిల్లా ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు అన్నారు. సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా స్థానిక గాంధీ మందిరం, స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.195 ఏళ్ల కితమే బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడ్డారని అన్నారు. కులాంతర వివాహాలను బహుధా ప్రోత్సహించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు విగ్రహదాత డాక్టర్ అరవింద్, కుటుంబ సభ్యులు, సెట్ శ్రీ విశ్రాంత సీఈవో సురంగి మోహనరావు,ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకమండలి మాజీ సభ్యులు డాక్టర్ జామి భీమశంకర్,గాంధీ మందిర నిర్వాహక సభ్యులు శాస్త్రి, లయన్స్ క్లబ్ హర్షవల్లి ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు జేమ్స్ వైద్య కళాశాల ప్రధానాచార్యులు, విద్యార్థులు ఇంకా



గాంధీ మందిరం సభ్యులు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సమస్యలపై చర్చేది?

నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఎన్నో సవాళ్లు ఉన్నాయి. మనిషి ఎప్పుడూ గతంలో జరిగినవి అనుభవాలుగా, గుణపాఠాలుగా తీసుకోబట్టే అభివృద్ధి పథంలో వున్నాడు. గతాన్ని ఒక జ్ఞాపకంగా మాత్రమే తీసుకుంటే అక్కడే ఉండి పోతాడు.

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలకు కొన్ని నమ్మకాలు, ఆచారాలని పాటిస్తారు. అవి చాలా వరకు వ్యక్తిగతంగానే ఉంటాయి. ప్రతి దేశానికి ఒక చరిత్ర ఉంటుంది. దాని నుండి మనం ఏమి నేర్చుకున్నామో అనే విషయంపై మన భవిష్యత్ ఆధార పడి ఉంటుంది. గతం మనకు ఒక పునాది మాత్రమే కావాలి. భవనం కాకూడదు.

ప్రతి వ్యక్తికి తాను పుట్టిన ప్రాంతం, ప్రజలపై మమకారం ఉంటుంది. కానీ మా ప్రాంతమే గొప్ప, మా ప్రజలే గొప్ప అని భావించడంలోనే అసలైన సమస్య వస్తుంది.

ప్రస్తుతం ప్రపంచాన్ని కృత్రిమ మేధ శాసిస్తుంది. భవిష్యత్ లో ఇది ఉద్యోగాలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో అనే విషయంపై సరైన చర్చ లేదు. బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భూమికి బదులు వీటిని కొనడం వల్ల లాభమా, నష్టమా అనే విషయం మీద చర్చ లేదు. ఇంకోవైపు ట్రంఫ్ వీరవిహారం చేస్తున్నాడు. దీనిపై చర్చ లేదు.ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి. పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది.

మన చర్చ అంతా సినిమాలు, ఆటలు, రాజకీయాలు చుట్టూ మాత్రమే తిరుగుతున్నాయి. వీటిపై కూడా చర్చ అవసరమే. కానీ ఇందులో సామాన్యులు సమిధలు అవకూడదనేది నా అభిప్రాయం. కొత్త ఏడాదిలోనైనా కొంత మార్పు వస్తుందేమో చూద్దాం.



యం.రాం ప్రదీప్

# విజయవంతమైన నేత్రవైద్య శిబిరం



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా అందత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో భావనపాడు గ్రామంలో ఉద్దానం అభ్యుదయ సేవా సమితి మరియు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది.ఈ శిబిరంలో , ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె దాస్ , ఆప్టోమెట్రిస్ట్ డి దినేష్ లు 60 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 8 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిని శ్రీకాకుళం శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు మాట్లాడుతూ మన అవయవాలలో నయనం ప్రధానం అని కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. కంటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలని, అందరూ ఈ ఉచిత కంటి పరీక్ష శిబిరాలను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ టి.రామారావు, సేవా సమితి సభ్యులు గుంటు విజయ్ బ్రదర్స్, మండల మహేష్,అడ్ల రాజేష్,కర్ని వెంకటరమణ మూర్తి, గిన్ని రాజు,బై జంగమయ్య, దండుపాటి పవన్ కుమార్,పరపతి పద్మనాభం, చిరంజీవి, సుంకర రాణి,కొంకి మోహిని,గనగళ్ళ ఉమ,అంగ సీత,చింత దివ్య,రోహిణి,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

**(నవతరం శ్రీకాకుళం)**

వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో శనివారం ఆయన శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి వద్ద గల వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల గదులను పరిశీలించిన ఆయన, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌కు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పట్టిక ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు.విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న హరిబాబు, పలు న్యాయపరమైన సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని, తోటి వారితో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉండాలని కోరారు. అనవసర గొడవలకు తావు లేకుండా, సామాజిక మాధ్యమాల దుష్ప్రభావానికి గురికాకుండా కేవలం చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. వసతి గృహాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి ఇ. అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.





# గ్లింప్స్ లో శ్రీలీల.. ఫస్ట్ లుక్ లో భాగ్యశ్రీ

కొన్ని నెలల కిందటి సంగతి. లెనిన్ ఫస్ట్ లుక్ రిలీజైంది. అఖిల్ చేయి పట్టుకొని శ్రీలీల కనిపించింది. అప్పట్లో క్యూట్ పెయిర్ అనుకున్నారంతా. కట్ చేస్తే, ఈరోజు హీరోయిన్ ఫస్ట్ లుక్ రిలీజైంది. భాగ్యశ్రీ లుక్ ను విడుదల చేశారు. లెనిన్ సినిమా నుంచి శ్రీలీలను తప్పించి, ఆ స్థానంలో భాగ్యశ్రీ బోర్సెను తీసుకున్నారనేది ఓపెన్ సీక్రెట్. అయితే ఆ విషయాన్ని మేకర్స్ చెప్పలేదు. ఈరోజు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ తో చెప్పకనే చెప్పారు. అచ్చమైన తెలుగింటి అమ్మాయిలా లంగావోణీలో భాగ్యశ్రీని ప్రజెంట్ చేశారు మేకర్స్. 'వెన్నెలల్లే ఉంటాది మా భారతి' అంటూ ఆమె పాత్ర పేరును కూడా వెల్లడించారు. ఇందులో రాయలసీమ యాసలో మాట్లాడనుంది భాగ్యశ్రీ. అడుగుపెట్టినప్పట్నుంచి సరైన సక్సెస్ అందుకోలేదు భాగ్యశ్రీ. తాజాగా వచ్చిన 'ఆంధ్రా కింగ్ తాలూకా' కూడా ఆమెకు కలిసిరాలేదు. అంతకంటే ముందొచ్చిన కాంత సినిమాలో నటన బాగుందని మెచ్చుకున్నారు తప్ప, సినిమాను హిట్ చేయలేదు జనం. దీంతో ప్రస్తుతం తన ఆశలన్నింటినీ 'లెనిన్'పైనే పెట్టుకుంది. ఈ సినిమా సక్సెస్ అఖిల్ కు ఎంత అవసరమో, భాగ్యశ్రీకి కూడా అంతే ముఖ్యం. జనవరి 5న ఈ సినిమా నుంచి తొలి పాటను విడుదల చేయబోతున్నారు. తమన్ సంగీత దర్శకుడు. గతంలో వినరో భాగ్యము విష్ణ?కథ సినిమాను తీసిన మురళీ కిషోర్ అబ్బూరు ఈ సినిమాను డైరక్ట్ చేస్తున్నాడు. నాగార్జున, నాగవంశీ కలిసి నిర్మిస్తున్నారు.

# 2026... ఆశల పల్లకి

కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టాం. సామాన్య జనమే కాదు, సెలబ్రిటీలు కూడా చాలా ఆశలు పెట్టుకున్నారు న్యూ ఇయర్ పై. సక్సెస్ ను కొనసాగించాలనే కోరిక కొందరిదైతే, ఎలాగైనా హిట్ కొట్టాలనే కసి మరికొందరిది. గతేడాది మిస్సయిన చాలామంది హీరోలు ఈ ఏడాది బాక్సాఫీస్ బరిలో అడుగుపెడుతున్నారు. 2026 స్టార్ ఎట్రాక్షన్స్ పై ఓ లుక్కేద్దాం.. ఈ ఏడాది 2 సినిమాలతో అలరించబోతున్నాడు ప్రభాస్. సంక్రాంతి బరిలో రాజాసాబ్ ను నిలిపిన ఈ హీరో, ఇదే ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ లో ఫౌజీ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నాడు. గతేడాది సిల్వర్ స్క్రీన్ ను మిస్సయిన ప్రభాస్, ఈసారి 2 సినిమాలతో ఆ గ్యాప్ ను భర్తీ చేయాలనుకుంటున్నాడు
చిరంజీవి నుంచి కూడా 2 సినిమాలొస్తున్నాయి. సంక్రాంతికి మనశంకర వరప్రసాద్ గారు సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్న చిరు, జూన్ లో విశ్వంభరతో థియేటర్లలోకి రాబోతున్నారు. కొత్త ఏడాదిలో ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో వర్క్ చేస్తున్నారు.
ఈ ఏడాది పవన్ కల్యాణ్ అభిమానులకు చాలా ప్రత్యేకం. పవన్ నుంచి ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా వస్తోంది. ప్రస్తుతానికి పవన్ నుంచి వస్తున్న చివరి సినిమా ఇదే. ఆయన కొత్త సినిమాలు ప్రకటిస్తారా లేక గ్యాప్ తీసుకుంటారా అనేది ఈ ఇయర్ డిసైడ్ చేస్తుంది.
ఎన్టీఆర్, రామ్ చరణ్ కూడా కొత్త ఏడాదిలో లక్ చెక్ చేసుకోబోతున్నారు. దేవర-1 తర్వాత వార్-2తో ఇబ్బంది పడిన తారక్, నీల్ సినిమాతో మరోసారి పాన్ ఇండియా లెవెల్లో మెరవాలని భావిస్తున్నాడు. అటు చరణ్ మాత్రం ఎట్టిపరిస్థితుల్లో హిట్ కొట్టాల్సిన క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాడు. గేమ్ ఛేంజర్ గట్టిదెబ్బ కొట్టింది.
ది ప్యారడైజ్ సినిమాతో నాని కొత్త ఏడాదిలో మెరవాలని భావిస్తుంటే, విజయ్ దేవరకొండ కనీసం న్యూ ఇయర్ లోనైనా సాలిడ్ హిట్ ఇవ్వాలని చూస్తున్నాడు. ఒకేసారి 2 ప్రాజెక్టులు చేస్తున్నాడు.
సాయిదుర్గతేజ్, బాలకృష? నుంచి కూడా కొత్త ఏడాదిలో సినిమాలు రాబోతున్నాయి.
నితిన్, రవితేజ, అఖిల్, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీవిష?, వరుణ్ తేజ్, శర్వానంద్, కల్యాణ్ రామ్, విశ్వక్ సేన్ లాంటి హీరోలంతా కొత్త ఏడాదిలో కొత్త సినిమాలతో అలరించబోతున్నారు. ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్న ఈ హీరోలంతా 2026లో విజయం కోసం వెయిటింగ్. వీళ్లలో వరుసగా హ్యాట్రిక్ ఫ్లాపులిచ్చిన హీరోలు కూడా ఉన్నారు.
ఇక హీరోయిన్లలో అందరి చూపు సమంతపై ఉంది. చాన్నాళ్లుగా సిల్వర్ స్క్రీన్ కు దూరమైన సమంత, ఈ ఏడాది లీడ్ రోల్ లో మా ఇంటి బంగారం సినిమాలో కనిపించనుంది. అటు రష్మిక తన హిట్ ట్రాక్ ను కొనసాగించాలని చూస్తుంటే.. కనీసం కొత్త ఏడాదిలోనైనా సాలిడ్ హిట్ కొట్టాలని శ్రీలీల వెయిటింగ్.



# నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సిమెంట్ స్టాకిస్టులు

- చిరు ఉద్యోగి మృతి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక భరోసా
- కేసీపీ సిమెంట్ గోడౌన్‌లో పనిచేస్తున్న చిరు ఉద్యోగి కోలగట్ల నాగేశ్ గుండెపోటుతో ఆకస్మిక మృతి
- కుమార్తె పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటిన జిల్లా సిమెంట్ స్టాకిస్టుల అసోసియేషన్



**(నవతరం శ్రీకాకుళం)**

శ్రీకాకుళం పట్టణంలో ఉదయం 8 గంటల సమయంలో చోటు చేసుకున్న విషాద ఘటన స్థానికులను కలచివేసింది. కేసీపీ సిమెంట్ కంపెనీ గోడౌన్‌లో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్న కోలగట్ల నాగేశ్ గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. కుటుంబానికి ప్రధాన ఆదారంగా ఉన్న నాగేశ్ మృతి ఆయన కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది.
ఈ విషయం తెలుసుకున్న శ్రీకాకుళం జిల్లా సిమెంట్ స్టాకిస్టుల అసోసియేషన్ మానవత్వంతో స్పందించింది. నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మరణించిన నాగేశ్ కుమార్తె పేరుపై రూ.1 లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం అందజేసింది. ఈ సహాయం కుటుంబానికి భవిష్యత్తులో కొంత భరోసా కలిగించేలా నిలిచింది.
ఈ సహాయ కార్యక్రమానికి ప్రధాన కారణమైన గురుగుబిల్లీ రాజారావును అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఇలాంటి సేవలు చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేసీపీ సిమెంట్ మేనేజర్ హరనాథ్, అసిస్టెంట్ మేనేజర్లు నూక రాజు, సాహు పాల్గొన్నారు. అలాగే సిమెంట్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీజు, బరటం సతీష్, సంతోష్, కళ్యాణ్, హరి, బన్నా పవన్, బరతం రవి తదితరులు హాజరై కుటుంబానికి సానుభూతి తెలిపారు.
నిరుపేద కుటుంబాలకు ఇలాంటి వేళల్లో అండగా నిలవడం సమాజ బాధ్యత అని, మరిన్ని సంస్థలు కూడా ఇదే మార్గంలో ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# అవయవ దాతకు జోహార్లు

## గ్రామీణ ప్రాంతం నుంచి వెలిసిన మహోన్నత మానవత్వం

**(నవతరం వంగర)**



వంగర మండలం ఎం.సీతారాం పురం గ్రామానికి చెందిన కలిగి ఆదినారాయణ గత నెలలో బ్రెయిన్‌డెడ్ స్థితిలో రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న మహోన్నత నిర్ణయం అనేక మంది జీవితాల్లో ఆశా కిరణాలను వెలిగించింది. ఆదినారాయణ గారి మరణానంతరం ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవ దానం చేయడం జరిగింది. ఈ క్రమంలో ఆయన నేత్రాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కళ్యాణ్ మగతపల్లి నేత్ర సేకరణ కేంద్రానికి దానం చేశారు. ఈ నేత్ర దానం ద్వారా చూపు కోల్పోయిన పలువురికి కొత్త జీవితం లభించే అవకాశం ఏర్పడిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున నిర్వహించిన కార్యక్రమంలోరెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్‌నేత్ర దాత ప్రశంసా పత్రాన్ని ఆదినారాయణ భార్య కలిగి జయమ్మ గారికి,కుమారుడు కలిగి అచ్యుతరావు గారికి అందజేశారు. ఈ సందర్భంగా పెంకి చైతన్య కుమార్ మాట్లాడుతూగ్రామీణ ప్రాంతమైన ఎం.సీతారాం పురం గ్రామం నుంచి ఈ విధమైన అవయవ దానం జరగడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆదినారాయణ గారి త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని మరిన్ని కుటుంబాలు ముందుకు వచ్చి నేత్ర దానం, అవయవ దానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం అవయవ దానం ద్వారా లభిస్తుందని,ఇది మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు సమాజంలో అవయవ దానంపై అవగాహన పెంచేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలోఎం.ఎస్.ఆర్.పురం పంచాయతీ సెక్రటరీ గేదెల రవితేజ,మహిళా సంరక్షణ కార్యదర్శి చౌదరి ఆశాలత పాల్గొనిఅవయవ దాత కుటుంబాన్ని అభినందించారు. వారి నిర్ణయం గ్రామానికే కాకుండా జిల్లా స్థాయిలోనూ ఆదర్శంగా నిలుస్తుందని వారు కొనియాడారు. మరణంలోనూ జీవనాన్ని ప్రసాదించిన ఆదినారాయణ గారి త్యాగంఎంతోమందికి ప్రేరణగా నిలిచి,అవయవ దానం అనే గొప్ప ఆలోచనను సమాజంలో మరింత ముందుకు తీసుకెళ్లేలా చేస్తుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.



# ఘన సన్మానం

**(నవతరం శ్రీకాకుళం)**

గత విద్యా సంవత్సరం 2024-25 పదో తరగతి ఫలితాలలో 545 బ్రాంచ్ సరాసరి మార్కులతో శ్రీకాకుళం జిల్లాలో ప్రథమ స్థానం,రాష్ట్రంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి అందించే ఆరు షైనింగ్ స్టార్ అవార్డులలో ఐదు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ ఘనవిజయానికి మూలకారకలైన బలగ శ్రీ చైతన్య ఉపాధ్యాయులందరికీ శ్రీ చైతన్య టెక్నో మేనేజ్మెంట్, పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏ జి ఎమ్ సురేష్ చేతుల మీదగా శాలువా మూమెంటోతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ ఏడాది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత ఏడాది ఫలితాలు వివరించి స్ఫూర్తినింపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య శ్రీకాకుళం రీజనల్ అధికారి రామినాయుడు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలతో కూడినటువంటి బోధనా పాఠశాల శ్రీ చైతన్య పాఠశాల అని ఉత్తమ ఫలితాలు గురించి కొనియాడారు. కోఆర్డినేటర్ బాలరాజు,ప్రిన్సిపల్ ఇంద్రమౌళి,డీన్ జగదీష్,ఐకాన్ ఇంచార్జ్ మల్లేశ్వరరావు, పదవ తరగతి ఇంచార్జ్ రాజేంద్రప్రసాద్, ప్రైమరీ ఇంచార్జి ఉషారాణి,ఏవో శ్రీనివాస్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా జీవిత ధ్రువపత్రాలు

**నవతరం -పొందూరు**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల,కుటుంబ పింఛనుదార్లకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పార్కు స్కూల్ ఆవరణలో ఉచితంగా జీవిత ధ్రువ పత్రాలను అందజేస్తున్నారు. జనవరి రెండో తేదీ నుండి ఫిబ్రవరి 28 వ తేదీ వరకు ఉచితంగా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్స్ (జీవిత ధ్రువపత్రాలు) కంప్యూటరికరించి అందజేస్తున్నారుఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నారు. పెన్షనర్స్ అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ తమ జీవన ధ్రువపత్రాలు పొందేందుకు రావాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి 1.00గంట వరకు ఫిబ్రవరి 28వ తేదీ వరకు కార్యాలయం లో అందుబాటులో ఉంటారు. పెన్షనర్ లందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పాలవలస దివాకరపాత్రో, అల్లంశెట్టి విజయకుమార్ తదితరులు ఆధ్వర్యం వహిస్తున్నారు.



# ఆమె స్ఫూర్తి అజరామరం

## శర్వాణీ విద్యాలయంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**(నవతరం శ్రీకాకుళం)**

అరసవల్లి రోడ్డులోని శర్వాణీ విద్యాలయంలో శనివారంభారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలనుసంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సూరిబాబు మాట్లాడుతూ,చదువు గొప్పతనాన్ని సమాజానికి తెలియజేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. విద్యావ్యాప్తి కోసం ఆమె ఎన్నో అవరోధాలు ఎదుర్కొని,మహిళా విద్యను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించిన విషయం గుర్తు చేశారు. ఆమె ఆశయాలు నేటికీ అనుసరణీయమని,ఆమె స్ఫూర్తి అజరామరమని విద్యార్థులకు వివరించారు. విద్య ద్వారా ఉన్నత స్థాయిలకు చేరుకోవచ్చని,కష్టపడి చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలోహెడ్‌మిస్ట్రెస్ కె. రేఖ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళాభ్యున్నతికి మార్గదర్శి సావిత్రిబాయి పూలే

**(నవతరం-అగ్నివర్ష)**

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుతో కలిసి జేఆర్‌పురం హైస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదుటి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ, సావిత్రి భాయ్ పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలు, సామాజిక సంస్కర్త, కవయిత్రిగా ఆమె తన భర్త జ్యోతిబా పూలేతో కలిసి భారతదేశంలోని మొదటి బాలికల పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారన్నారు. మహిళలు, అణగారిన వర్గాల విద్యకు ఆమె చేసిన కృషికి గుర్తుగా ఆమె జయంతిని దేశంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా కూడా జరుపుకోవడం ఆనందంగానుందని పేర్కొన్నారు. తదుపరి హైస్కూల్ క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రణస్థలం విద్యా శాఖాధికారి, జేఆర్ పురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**